క్లుప్తంగా

చాంబర్స్ విద్యార్థుల వితరణ

పాలకొల్లు సెంట్రల్: ఆచంట మండలం వేమవరం గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీలం దివ్య గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విద్యార్థిని అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న చాంబర్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు రూ.97,160లు నగదు సేకరించి శనివారం కళాశాల వద్ద దివ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు మాట్లాడుతూ కష్టంలో ఉన్నవారిని ఆదుకోవడానికి విద్యార్థులు నగదు సేకరించడం వారి సేవా గుణానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల వినతి

పాలకొల్లు అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో సమృద్ధిగా సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు ఆర్డీవో డాక్టర్ ఎం.అచ్యుతాంబరీస్‌కి శనివారం వినతి పత్రం అందజేశారు. రాపాక ఛానల్ శివారు శివదేవుని చిక్కాల, బల్లిపాడు, గవరపేట, పాలమూరు చేలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేసి వంతుల విధానంలో సాగునీరు సక్రమంగా అందించడానికి ఆదేశాలిస్తామన్నారు. ఈ సీజన్‌లో వర్షాలు సరిగా కురవకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ వడ్డె సోమచంద్రశేఖర్ (గణి), రైతులు తాళ్లూరి శ్రీనివాస్, పిల్లా శ్రీనివాస్, గన్నాబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ విద్యార్థినులకు స్పోర్ట్స్ షూస్ బహూకరణ

పాలకొల్లు సెంట్రల్: విద్య, క్రీడల్లో రాణించే విద్యార్థులకు దాతల సహకారం ఎప్పుడూ ఉంటుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 20 మంది విద్యార్థినులకు క్లబ్ ఆధ్వర్యాన స్పోర్ట్స్ షూస్, క్రీడా దుస్తులు అందజేశారు. సుధాకరరావు మాట్లాడుతూ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వాకర్స్ క్లబ్ తరఫున మరింత ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, క్లబ్ సెక్రటరీ పీర్ సాహెబ్, ఉమా శంకరరావు, మానెం బసవరాజు, కళ్యాణ్, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దామోదర లీల అలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం త్రయోదశి కావడంతో దామోదర లీలగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి తలనీలాలు సమర్పించడం, స్వామివారికి ఏడు వారాల ప్రదక్షిణలు చేయడం, అన్నసమారాధనలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అన్నసమారాధనలో సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అన్నదానం, దర్శన సమయంలో తోపులాట జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు.

ధర్మాచరణ దిశగా జీవించాలి

పెనుగొండ: సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాచరణ దిశగా జీవించాలని, తద్వారా సమాజ శాంతిని నెలకొల్పాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి అన్నారు. శనివారం సిద్ధాంతంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన నిర్వహించిన సత్సంగంలో పాల్గొని ప్రవచించారు. రామాయణంలో ఉన్న విలువలను అర్థం చేసుకోవాలన్నారు. బాలలు, యువతలోనూ ధార్మికతను పెంపొందింప చేయాలన్నారు. కుటుంబ విలువలు, నైతిక విలువలను తెలుసుకోవాలన్నారు కార్యక్రమంలో సంఘ సభ్యులు యక్కల త్రిమూర్తులు, చోడవరపు శ్రీనివాస్, కీర్ల భద్రయ్య, చింతాకుల గోపాలకృష్ణ, సుంకర సత్యనారాయణ, చల్లా శివ సుబ్బారావు, బీఎస్ శ్రీనివాస్, జయవరపు నానాజీ పాల్గొన్నారు.

నేడు ఆచంటేశ్వరునికి కర్పూర జ్యోతి ప్రజ్వలన

పెనుగొండ: ప్రతి ఏటా ఆచంట శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న అఖండ కర్పూర జ్యోతి ప్రజ్వలన ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక పౌర్ణమి నాడు వెలిగించే అఖండ జ్యోతి మహాశివరాత్రి వరకూ నిరాటంకంగా వెలుగుతుంది. కార్తీక మాసం పౌర్ణమి నాడు కృతికా నక్షత్ర హోమం నిర్వహించి జ్యోతి వెలగించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్తర భారత దేశంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, దక్షిణ భారత దేశంలోని ఆచంటేశ్వర స్వామి ఆలయంలో మాత్రమే జ్యోతిని వెలిగించడం విశేషం, జ్యోతి ప్రజ్వలనకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చి జ్యోతిని దర్శించుకుని ఆవు నెయ్యి వడ్డిస్తారు. కర్పూర జ్యోతికి ఆవు నెయ్యి వడ్డిస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రాము తెలిపారు.

అవినీతిపై మాట్లాడే నైతికత పితానికి లేదు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పదిహేను సంవత్సరాల పాటు ప్రతి దానిలోనూ కమీషన్లు దండుకుని 'టెన్ పర్సెంట్ మంత్రి'గా పేర్గాంచిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, తనపైనా విమర్శలు చేసే నైతికత లేదని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎద్దేవా చేశారు. శనివారం ఆచంటలో జరిగిన భూ పంపిణీ సమావేశంలో మాజీ మంత్రి పితానిపై ఆయన ఫైర్ అయ్యారు. చివరకు బాధితులకు అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు మంజూరులో, పాఠశాలలకు అందించే సర్వశిక్ష అభియాన్ నిధుల్లోనూ కమీషన్లు తీసుకున్న సంగతి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. ఈఎస్ఐ స్కామ్‌లో తప్పించుకోవడానికి నానా తంటాలు పడి కుమారుడిని ఆరు నెలలు పాటు రాజస్థాన్‌లో దాచుకోవాల్సిన పరిస్థితి మాజీ మంత్రి పితానికి ఏర్పడిందన్నారు. ఆనాడు మాజీ మంత్రి పితాని కుమారుడు ఎక్కడ దాక్కొన్నాడో తనకు తెలుసునని, కక్ష సాధింపు చర్యలే ఉంటే ఏసీబీకి సమాచారం అందించేవాడనన్నారు. అయినా దొంగలను పట్టించే విధి తనది కాదని, నియోజకవర్గంలో ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడం, అభివృద్ధిపైనే దృష్టి సారించానన్నారు. దొంగలా దాక్కున్నా ఏనాడు విమర్శించలేదన్నారు. నేడు మాజీ మంత్రి పితాని స్థాయి మరచి సీఎం జగన్‌పైనా విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో గోదావరి వరదల్లో ఇలా విమర్శించే లేనిపోని ఆరోపణలు చేయడం వలన అరగంటలోనే ఫలితం చవిచూడాల్సి వచ్చిందని హితవు పలికారు. నియోజకవర్గాన్ని ఎక్కడా అభివృద్ధి చేయకుండా వర్గాలను పోషిస్తూ పితాని ఆనందపడేవరన్నారు. తాము పార్టీలకు అతీతంగా పారదర్శకంగా టీడీపీ వారికైనా సరే పథకాలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కనీసం రూ.100 అయినా తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానంటూ సవాల్ విసిరారు. కార్యక్రమంలో అధికారులతో పాటు ఎంపీటీసీలు పెచ్చెట్టి లలిత, చిన్నం ఏడుకొండలు, కంచుస్తంభం శ్రీను పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు

రామన్నపాలెం అరుంధతి పేట అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు సత్వరం ప్రారంభిచేలా చర్యలు తీసుకుంటామన్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

జగన్నాథపురంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: జగన్నాథపురం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శనివారం రాష్ట్ర మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ గుడాల శిరీష చంటి దంపతులు భూమిపూజ నిర్వహించారు. భూమిపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఎంపీటీసీ దిద్దే అఖిల, దిద్దే శ్రీనివాస్, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, గొట్టుముక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాకు యాంటీ బయాటిక్స్ వినియోగంతో అనర్థాలు

నరసాపురం రూరల్: ఆక్వా సాగులో యాంటీ బయాటిక్స్ వినియోగం వల్ల సంభవించే అనర్థాలను నిరోధించేందుకు ప్రభుత్వం రూపొందించిన యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కార్యక్రమాన్ని శనివారం నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపెడా జీసీ సభ్యులు కేఆర్‌కే మూర్తి రాజు మాట్లాడుతూ ఆక్వా సాగులో రైతులు ఎక్కువగా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారన్నారు. వీటి వినియోగంతో అనేక ప్రమాదాలు, నష్టాలు జరుగుతున్నాయన్నారు. వాటిని రైతులకు వివరించేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆక్వా కల్చర్‌లో యాంటీ బయాటిక్స్ వాడకుండా చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులైన బయో సెక్యూరిటీ, నీటి నాణ్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. గామ సర్పంచ్ నల్లి వరలక్ష్మి, నాక్సా కో ఆర్డినేటర్ ఎన్.బాలాజీ, ఫీల్డ్ మేనేజర్లు కె.రాంబాబు, ఎ.భువన, జి.రామరాజు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు స్థానంలో పార్కు

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి


పాలకొల్లు యడ్లబజార్‌లో చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న గోపి

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని యడ్లబజార్‌లో డంపింగ్ యార్డును ప్రాసెసింగ్ చేసిన అనంతరం ఆ ప్రాంతాన్ని పూర్తిగా ఖాళీ చేసి సందర్శకులు సేద తీరడానికి అందమైన పార్కును నిర్మిస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) వెల్లడించారు. డంపింగ్ యార్డులో చెత్త ప్రాసెసింగ్ చేస్తున్న విధానాన్ని శనివారం ఆయన పరిశీలించారు. డంపింగ్ యార్డు ఖాళీ చేయడం వలన పట్టణ ప్రజలు 40 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న సమస్యకు విముక్తి కలుగుతుందన్నారు.

కరోనా బిల్లులపై విచారణకు సిఫార్సు

కోవిడ్ బిల్లుల అక్రమాలపై విజిలెన్స్‌కు తాము ముందే సిఫార్సు చేశామని గుడాల గోపి వెల్లడించారు. ఎమ్మెల్యే నిమ్మల కోవిడ్ బిల్లుల్లో అవినీతి జరిగిందని విచారణ చేయమనడం సరికాదన్నారు. అవినీతికి 60 కిలోమీటర్ల దూరంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉంటారని, కమిషన్ల కోసమే టీడీపీ నాయకులు పనిచేస్తారని, ఎమ్మెల్యే నిమ్మల పెద్ద అవినీతిపరుడని గుడాల గోపి దుయ్యబట్టారు.

సీసీ రోడ్డు పరిశీలన

రామయ్య హాలు జీ+1 కాలనీకి వెళ్లడానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును గుడాల గోపి పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పార్టీ దెందులూరి నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ బీవీఆర్ శేషాద్రి, వార్డు ఇన్‌చార్జ్‌లు రుంకాని దుర్గారావు, మద్దా చంద్రకళ, వార్డు నాయకులు పైలా రాజశ్రీ, కోట రత్నంరాజు, ఉండ్రాజవరపు రవికుమార్, నల్లి జయరాజు, ఆలయాల చైర్మన్‌లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన


కొప్పర్రులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలనను అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని కొప్పర్రు గ్రామంలో కొప్పర్రు–శేరేపాలెం రోడ్డులో ఉన్న బ్రిడ్జి నుంచి మల్లవరం లంక వరకు జిన్నూరు పంట కాలువ వెంబడి ఉన్న ఆర్ అండ్ బీ రహదారి, రుస్తుంబాద బ్రిడ్జి నుంచి మంగళగుంట పాలెం సీసీ రోడ్డు వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు రహదారులు కలిపి సుమారు 7 కిలో మీటర్లకు రూ.2.70 కోట్లు నిధులు వెచ్చిస్తున్నామన్నారు. ఈ రోడ్లకు నిధులు మంజూరైన అనతి కాలంలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గంలో రూ.80 కోట్లతో 18 రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో కొన్ని రోడ్లు నిర్మాణం పూర్తి చేసుకోగా, మరికొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే మరికొన్ని రోడ్లు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలకు ఒకసారి రోడ్లు నిర్మించడం జరుగుతుందని, ఈ రోడ్లు వేసి పది సంవత్సరాలకు పైగా అవుతుందన్నారు. మళ్లీ ఈ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షల విమర్శల వల్లనో, ఎవరు మెప్పు కోసమో అభివృద్ధి పనులు చేయడం జరగదని, కేవలం ప్రజల సౌకర్యార్థం మాత్రమే పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, మైలాబత్తుల శ్రీను, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, గ్రామ సర్పంచ్ నల్లి వరలక్ష్మి జేమ్స్, ఆర్ అండ్ బీ డీఈ జీవీఎస్ కిరణ్ కుమార్, ఎంపీటీసీ బద్దా శాంతకుమారి, వలవల ఏసుబాబు, ప్రజాప్రతినిధులు అందే కవికుమార్, పోలిశెట్టి గోపి, రావి బ్రహ్మాజీ, బాబా, పులఖండం రామకృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పవన్‌కు పతకాలు

పాలకొల్లు సెంట్రల్: నేషనల్ మెడికల్ ఒలింపియాడ్‌లో జరిగిన పలు క్రీడల్లో పట్టణానికి చెందిన డాక్టర్ బెల్లంకొండ పవన్‌కుమార్ పతకాలు సాధించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి ప్రారంభమైన నేషనల్ ఒలింపియాడ్ 2023 పోటీల్లో పాలకొల్లుకు చెందిన రవి డయాగ్నోస్టిక్ సెంటర్ రేడియాలజిస్ట్ డాక్టర్ బెల్లంకొండ పవన్‌కుమార్ పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ 35 నుంచి 45 ఏళ్ల విభాగంలో అథ్లెటిక్స్ విభాగంలో ఆఫ్ మారథాన్ 21.1 కిలో మీటర్లలో సిల్వర్ మెడల్, 10 కిలో మీటర్ల పరుగు పందాల్లో సిల్వర్ మెడల్, 4 ,100 రిలే పరుగు పందాల్లో కాంస్యం పతకాలను సాధించినట్లు తెలిపారు. తాను ఆడిన యునైటెడ్ డాక్టర్స్ ఫుట్‌బాల్ టీం విన్నర్‌గా కప్ గెలుచుకున్నామన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అర్థం చెప్పిన ప్రసాద్

యలమంచిలి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిజమైన అర్థం చెప్పిన వ్యక్తి ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ అని ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి) అన్నారు. యలమంచిలి ఎస్సైగా రెండున్నరేళ్లు పని చేసి బదలీపై భీమవరం క్రైంకు వెళ్తున్న ఎస్సై విజయ్ నాగ ప్రసాద్‌ను శనివారం పోలీస్ స్టేషన్ వద్ద మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె సన్మానించారు. ఈ రెండున్నరేళ్లలో మండలంలో ఏ సమస్య వచ్చినా సానుకూలంగా పరిష్కరించడంలో ప్రసాద్ విజయం సాధించారన్నారు. సంక్రాంతి సమయంలో జూదాలను అరికట్టి సామాన్య ప్రజలకు మంచి చేశారని కొనియాడారు. ఎస్సై ప్రసాద్ స్పందిస్తూ 2016లో పోలీస్ ఉద్యోగంలోనికి వచ్చాక విజయవాడ, పాలకొల్లు స్టేషన్లలో సీఐల కింద పని చేశానన్నారు. మూడో పోస్టింగ్ యలమంచిలి స్టేషన్‌లో స్వతంత్రంగా ఎస్సైగా పనిచేయడం నూతన ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, సర్పంచ్‌లు పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, గటిగంటి మహేష్, పొన్నమండ నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు వినుకొండ ధనలక్ష్మి రవికుమార్, కదలి సుబ్బలక్ష్మి ఏడుకొండలు, డేగల సూర్యప్రభ పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై మండిపాటు


మాట్లాడుతున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి)

యలమంచిలి: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడం సమంజసం కాదని ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి) ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామంలో ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి మార్గం కనుగొనడానికి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంచి వేదికన్నారు. అంత ప్రాముఖ్యత ఉన్న సమావేశాలకు అధికారులు డుమ్మా కొడితే ఇక సమావేశం నిర్వహించడం ఎందుకని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మండల సమావేశం నిర్వహించినప్పుడు మినిట్స్ బుక్ ఏర్పాటు చేసి అందులో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఇలా చేయడం వలన మళ్లీ సమావేశం జరిగినప్పుడు గత సమావేశంలో వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కారమయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే గైర్హాజరు అయిన అధికారుల వివరాలను కలెక్టర్‌కు పంపితే అక్కడి నుంచి వారికి ఆదేశాలు వెళ్తాయన్నారు. అనంతరం శాఖల వారీగా మండలంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, తహసీల్దార్ మాతా సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన


రాజులగరువులో శంకుస్థాపన చేస్తున్న గోపి

పోడూరు: పెనుమదం శివారు రాజులగరువు గ్రామంలో ఫెయిత్ చర్చి నిర్మాణ పనులకు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొత్రపాటి వీరాస్వామి, ఎంపీటీసీ–2 చుట్టుగుల్ల ఆంజనేయులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు, ముమ్ముడివరపు ఆంజనేయులు, పాస్టర్ శామ్యూల్ బాబు, కొల్లి వెంకట్రావు, బీరా రాజశేఖర్, తవిటి మత్రయ్య, కొట్టు ఎర్రయ్య, తవిటికి కళ్యాణ్, బొడ్డు బాబి, నేలపాటి రాజబాబు, నూటికుర్తి మన్నేసు, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం పాలకొల్లు మండలం తిల్లపూడి సచివాలయ ఆవరణలో గృహ లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుక, ఐరన్, సిమెంట్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే ఉచిత విద్యుత్ కనెక్షన్, మంచినీటి కుళాయి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నడపన శ్రీనివాసరావు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి సతీష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించండి


యలమంచిలిలో మానవహారంగా ఏర్పడిన మహిళలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

యలమంచిలి: ఆడ పిల్లలను రక్షించండి.. చదివించండి అనే నినాదంతో యలమంచిలిలో శనివారం ఐసీడీఎస్, వైఎస్సార్ క్రాంతి పథం సంయుక్త ఆధ్వర్యాన మహిళలు, ప్రజాప్రతినిధులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి) మాట్లాడుతూ ఏ వయస్సులోనైనా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఆడపిల్లలను శారీరకంగా, మానసికంగా హింసించడం, బాధించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వినుకొండ ధనలక్ష్మి రవికుమార్, కడలి సుబ్బలక్ష్మి ఏడుకొండలు, డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చివటపు నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ హసీనా, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పఢావో

పెనుగొండ: ఆడ పిల్లలను రక్షించడంతో పాటు ఉన్నత చదువులు చెప్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎం రూత్ కుమారి అన్నారు. శనివారం నడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో.. బేటి పఢావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంక్షేమం అందరి బాధ్యత

నరసాపురం రూరల్: బాలికల విద్యా ప్రాముఖ్యత, లింగ సమానత్వం పెంపునకు బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ విజిటర్ నాగమణి అన్నారు. శనివారం ఆరోగ్య కేంద్రం ఆవరణలో బేటీ బచావో– బేటీ పఢావో 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు.

వృత్తిలో రాణించాలంటే నైపుణ్యం అవసరం

పాలకొల్లు అర్బన్: వృత్తిలో రాణించాలంటే నైపుణ్యం అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణ, కారు డ్రైవింగ్‌లో శిక్షణ అలాగే కుట్టు శిక్షణ పొందిన మహిళలకు మెషీన్లు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జేసీ సుందరరామరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలోనే వృత్తి నైపుణ్యం కోర్సులో శిక్షణ పొందాలన్నారు. నిరుద్యోగ యువత ఇటువంటి శిక్షణలు పొందడం వలన నైపుణ్యత పెరిగి ఉద్యోగ అవకాశాలు త్వరగా పొందవచ్చన్నారు. కారు డ్రైవింగ్ కోర్సును ఆర్డీవో డాక్టర్ ఎం.అచ్యుతాంబరీస్ ప్రారంభించి ఎమాట్లాడుతూ స్త్రీ, పురుష బేధం లేకుండా ప్రతి ఒక్కరూ వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ట్రైనీ సబ్ కలెక్టర్ సంగీత్ మాధవ్ నాయుడు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు, అధ్యక్షురాలు నిమ్మల కృష్ణవేణి, కోశాధికారి నిమ్మల భవాని, ట్రస్టీలు నిమ్మల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ దిడ్ల మణివజ్రం, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్, మాజీ సర్పంచ్ వడ్డె సోమచంద్రశేఖర్ (గణి), మేనేజర్ వడ్డె నారాయణరావు, ట్రైనీలు నాగాబత్తుల రాజు, చిన్నం దుర్గాప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగల అరెస్ట్

పాలకోడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బ్యాటరీలు, బైకులు దొంగతనం చేస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నట్లు వారి నుంచి 1.98 లక్షలు రూపాయలు విలువైన బ్యాటరీలు, బైకులు స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం రూరల్ సీఐ వై.సత్య కిషోర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో బైకు బ్యాటరీల దొంగతనాల కేసులు ఎక్కువ అవ్వడంతో ఎస్సై నాలం శ్రీనివాసరావు తమ సిబ్బందితో పాలకోడేరు మండలంలో నిఘా పెట్టగా కోరుకొల్లు జంక్షన్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురు యువకులను తీసుకున్నామని వారి నుంచి 13 బ్యాటరీలు ఒక ఇన్వర్టర్, 20 లీటర్ల ఆయిల్, ఒక బైకు రికవరీ చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో భీమవరానికి చెందిన కూరపాటి రాజేష్, కర్రి రాము పాత దొంగలే కాగా మోగల్లుకు చెందిన రుద్రరాజు నితిన్ వర్మ, ఎస్.కె చాంద్ బాషా, గరగపర్రుకు చెందిన సిరింగుల ఏసేబు రాజులను అదుపులోకి తీసుకున్నామని వివరించారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

9న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం రూరల్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన వచ్చేనెల 9వ తేదీన రాజీ కాదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ తెలిపారు.